క్లుప్తంగా

ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన కల్పించాలి

రాజోలు: ఎస్సీ, ఎస్టీ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని దళిత చైతన్య వేదిక నాయకులు తహసీల్దార్ గోపాలకృష్ణకు విజ్ఞప్తి చేశారు. బుధవారం దళిత చైతన్య వేదిక నాయకులు తహసీల్దారును కలసి ప్రతి గ్రామంలో ఎస్సీ, ఎస్టీ చట్టాలపై అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు. ప్రతి నెల చివరి వారంలో మండల పరిధిలో ఒక గ్రామంలో సివిల్ రైట్స్ డే నిర్వహించి దళితులకు, దళితయేతరులకు ఎస్సీ, ఎస్టీ చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. దళిత చైతన్య వేదిక నాయకులు బత్తుల మురళీకృష్ణ, మండల ఉపాధ్యక్షుడు పాలమూరి శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవో కార్యాలయ సందర్శన

సఖినేటిపల్లి: మండల విద్యాశాఖాధికారి కార్యాలయాన్ని బుధవారం సమగ్ర శిక్షా ఫైనాన్స్ అక్కౌంట్స్ ఆఫీసర్ జి.ప్రవీణ్ కుమార్, జిల్లా సమగ్ర శిక్షా సీనియర్ అకౌంటెంట్ వి.వరప్రసాద్ సందర్శించారు. ఈ మేరకు కార్యాలయంలో పలు రికార్డులను వారు పరిశీలించారు. అనంతరం అక్కడే మండల స్థాయిలో అదనంగా ఉన్న పాఠశాలల నుంచి, లేని పాఠశాలలకు సర్దుబాటు చేస్తున్న పాఠ్యపుస్తకాలు, నోట్స్ బుక్స్, యూనిఫాం, బెల్ట్‌లు, స్టూడెంట్ కిట్లను పరిశీలించారు. ఎంఈవో-1 డి.కిషోర్ కుమార్, ఎంఈవో-2 మద్దాలి వెంకటేశ్వరరావు, స్టాఫ్ రాజుబాబు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంతర్వేది తీరంలో సాగర్ కవచ్ కార్యక్రమం

సఖినేటిపల్లి: అంతర్వేది సముద్ర తీరంలో బుధవారం సాగర్ కవచ్ కార్యక్రమాన్ని రాజోలు సీఐ ఆర్.గోవిందరాజు పర్యవేక్షణలో సివిల్, మెరైన్ పోలీసులు, కోస్ట్ గార్డ్స్ సిబ్బంది నిర్వహించారు. సముద్ర మార్గం ద్వారా దేశంలోకి ప్రయత్నించే ముష్కరుల ఆచూకీ కనిపెట్టే క్రమంలో రిహార్సల్ చేశారు. ఈ మేరకు డమ్మీ ముష్కరులు పల్లిపాలెం చేపల రేవు మీదుగా చొరబాటుకు యత్నిస్తున్న సమాచారం ఆధారంగా ఈ రిహార్సల్ చేశారు. దేశ భద్రతే లక్ష్యంగా పూర్తి అప్రమత్తంగా ఉండేందుకు ఈ కార్యక్రమాన్ని వారు చేపట్టారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

మామిడికుదురు: పాశర్లపూడిబాడవ సత్రం తోట, ఈదరాడ గ్రామాల్లో బుధవారం ముమ్మరంగా సంపూర్ణ పారిశుధ్య పనులు నిర్వహించారు. దోమల నిర్మూలనకు ఎబేట్‌తో పాటు మలాథియాన్ మందును స్ప్రే చేయించారు. పాశర్లపూడిబాడవ సత్రంతోటలో డ్రైన్‌ను శుభ్రం చేశారు. డ్రైన్‌లోని ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించారు. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల మురుగునీరు నిల్వ ఉండి దోమలు విపరీతంగా పెరిగిపోతున్నాయని పంచాయతీ కార్యదర్శి కేవీ సత్యనారాయణ, హెల్త్ అసిస్టెంట్ కేవీ సూర్యనారాయణ పేర్కొన్నారు. దోమల వల్ల డెంగీ, మలేరియా, ఫైలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉందన్నారు. ఈదరాడలో పంచాయతీ కార్యదర్శి పీవీఆర్‌కే రాజు, హెల్త్ అసిస్టెంట్ ఉమామహేశ్వరరావు, పీహెచ్‌సీ ఉద్యోగుల పర్యవేక్షణలో పారిశుధ్య పనులు చేపట్టారు.

దివ్యాంగులను పాఠశాలల్లో చేర్పించాలి

అయినవిల్లి: మండలంలోని సిరిపల్లి చెరువు గట్టు ప్రాథమిక పాఠశాలలో ఉన్నటువంటి భవిత సెంటర్‌లో బుధవారం దివ్యాంగుల పిల్లల కేంద్రాన్ని జిల్లా సమగ్ర శిక్ష సహిత విద్య సమన్వయకర్త సత్యనారాయణ సందర్శించారు. ఆయన ఐఆర్‌టీలకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మండలంలోని సహిత విద్యను ఇంకా వేగవంతంగా అభివృద్ధి పరిచి పిల్లలకు అందించాలని ఆయన సూచించారు. దివ్యాంగ పిల్లలు మండలంలో ఎక్కడ ఉన్నా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. రవాణా భత్యం కూడా ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. ప్రభుత్వం దివ్యాంగ పిల్లలకు అనేక ప్రోత్సాహకాలు అందిస్తుందని వీటిని సద్వినియోగించుకోవాలని దివ్యాంగుల తల్లిదండ్రులకు తెలిపారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీలు వేంకటేశ్వరరావు, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

అంబాజీపేట: చిన్నతనం నుంచి ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించడం వల్ల భవిష్యత్ బంగారు బాట అవుతుందని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి అన్నారు. అంబాజీపేట నాగమల్లిచెట్టు వద్ద ఉన్న ప్రాథమిక పాఠశాలలో ప్రభుత్వం పంపిణీ చేసిన స్టూడెంట్ కిట్లను హెచ్‌ఎం వి.సూర్యనారాయణమూర్తి అధ్యక్షతన బుధవారం పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి రెండు జతల యూనిఫామ్, షూ, సాక్సులు, పాఠ్య, నోట్ పుస్తకాలు, టై, బెల్ట్, బ్యాగ్‌లను ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. మధ్యాహ్నం పౌష్టికాహారాన్ని అందిస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకుని శ్రద్ధగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో పేరి శ్రీనివాస్, సుంకర పేరయ్యానాయుడు, శీలం మోహనరావు, నాగాబత్తుల సుబ్బారావు, పితాని శెట్టి, యాగన రాము తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో డిమాండ్స్ డే
- తహసీల్దార్ కార్యాలయాల వద్ద ధర్నా
- వినతిపత్రాల అందజేత



సఖినేటిపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు



అయినవిల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు

అయినవిల్లి: అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకం, నేషనల్ హెల్త్ మిషన్, సమగ్ర శిక్ష వెలుగు, మెప్మా ఉపాధి, ఆయుష్, సేంద్రియ వ్యవసాయం, 108, 104 తదితర పథకాల కార్మికులను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద అయినవిల్లి మండల సీఐటీయూ కన్వీనర్ ఈ.మంగాయమ్మ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్న భోజన పథకం, నేషనల్ హెల్త్ వివిధ కార్మిక సంఘాల నాయకులు ఆందోళన చేశారు. లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని, ప్రైవేటీకరణను, జాతీయ నగదు బదిలీకరణ పథకాలను ఆపాలని, కనీస వేతనం నెలకు రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆర్ఐకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పి.గన్నవరం ప్రాజెక్ట్ లీడర్ కె.వెంకటలక్ష్మి, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకురాలు ఉమామహేశ్వరి, మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ సుంకర నాగవేణి, బండి లక్ష్మీదేవి తదితరులు ఉన్నారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం పలు కార్మికుల సమస్యలపై కార్మికులు ధర్నా చేశారు. దేశవ్యాప్త కార్మికుల డిమాండ్స్ డే పురస్కరించుకుని వారు పై ధర్నా నిర్వహించారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలను తిరిగి ప్రారంభించాలని తదితర డిమాండ్లతో ఒక వినతి పత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు డి.లలిత కుమారి, కేజీ రత్నకుమారి, సీహెచ్ ప్రకాశమ్మ, పలువురు ఆశ కార్యకర్తలు, ఇతర విభాగాల కార్మికులు పాల్గొన్నారు.

మామిడికుదురులో..

మామిడికుదురు: ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని తదితర డిమాండ్లతో సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం మామిడికుదురు మండల రెవెన్యూ కార్యాలయం వద్ద వివిధ ఉద్యోగుల ధర్నా చేశారు. ధర్నా అనంతరం తహసీల్దార్ ఎం.మేరికమ్మకు వినతిపత్రం ఇచ్చారు. ఈ ధర్నాలో అంగన్‌వాడీ, ఆశ ప్రతినిధులు పాల్గొన్నారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల నిరసన

సమగ్ర శిక్ష జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) పిలుపు మేరకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు బుధవారం మామిడికుదురు ఎమ్మార్సీ, ఈదరాడ జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. రెండు నెలల పెండింగ్ జీతాలు విడుదల చేయాలని, హెచ్ఆర్ పాలసీ, ఎంటీఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఆలమూరులో..

ఆలమూరు: ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు ఇచ్చిన హామీలు అమలుకు సత్వరమే అమలు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మండల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ బుధవారం ధర్నా నిర్వహించింది. అసంఘటిత కార్మికుల డిమాండ్స్ డే సందర్భంగా మండల కేంద్రమైన ఆలమూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద ఈ ధర్నా జరిగింది. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ డీవీఎస్ అనిల్‌కుమార్‌కు అందజేశారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: అంగన్‌వాడీ, ఆశా, మిడ్డే మీల్స్ నిర్వాహకులు, స్కూల్ ఆయాలు, డ్వాక్రా యానిమేటర్ల డిమాండ్‌లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని ఆయా సంఘాల నాయకులు పేర్కొన్నారు. డిమాండ్స్ డే సందర్భంగా అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ జె.విమలకుమారికి అందజేశారు. కార్యక్రమంలో కారెం వెంకటేశ్వరరావు, బి.ఎస్తేరురాణి, డి.లలితకుమారి, ఆర్.దుర్గామహేశ్వరి, జి.పాపాయమ్మ, వి.కరుణ, చినవెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక విక్రయాలు ప్రారంభం

కొత్తపేట ఇసుక నిల్వ స్టాక్ పాయింట్లో 25,898 టన్నులు



కొత్తపేట ఇసుక స్టాక్ పాయింట్‌లో ఇసుక ఎగుమతిని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఎలీషా

కొత్తపేట: స్థానిక షిర్డీ సాయిబాబా ఆలయం సమీపాన ఇసుక నిల్వ స్టాకు పాయింట్లో ఉచిత ఇసుక విక్రయాలు ప్రారంభించారు. గోదావరికి వరదలు వచ్చినప్పుడు, వర్షాకాలంలో ఇసుక ర్యాంపుల్లోకి లారీలు వెళ్లలేని పరిస్థితుల్లో వినియోగదారుల సౌకర్యార్థం గత ప్రభుత్వం ఇసుక నిల్వలు పెట్టిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా ఎన్డీఏ కూటమి అధికారంలోకి వస్తే ఇసుక ఉచితం చేస్తామని కూటమి నేతలు హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టింది. అప్పటికి స్టాక్ పాయింట్లలో ఉన్న నిల్వలకు ప్రస్తుతం అధికారులు స్వాధీనం చేసుకుని, విక్రయాలు చేపట్టే నాటికి ఉన్న నిల్వలకు పొంతన లేదు. ఈ మధ్య కాలంలో ఇసుకాసురులు ఇసుక గుట్టలను కొల్లగొట్టారు. ఆ విధంగా ఇసుక తరిగిపోయింది. ప్రస్తుతం అధికారుల అంచనా ప్రకారం కొత్తపేట స్టాక్ పాయింట్‌లో 25,898 మెట్రిక్ టన్నులు ఇసుక నిల్వ ఉన్నట్టు గుర్తించారు. కాగా ఎన్నికల హామీ మేరకు ఉచిత ఇసుక విధానం అమలు చేస్తున్నామన్న ప్రభుత్వం తవ్వకాల ఖర్చు, సీనరేజీ, జీఎస్టీ పేరుతో నామమాత్రపు రుసుం అంటూ టన్ను ఇసుకకు రూ.245 ధర నిర్ణయించింది. ఆ మేరకు స్థానిక స్టాకు పాయింట్లో బుధవారం సాయంత్రం తహసీల్దారు ఎలీషా ఇసుక విక్రయాలు ప్రారంభించారు. ఇక్కడ 200 పవర్ జేసీబీ మెషీన్‌తో ట్రాక్టర్లు, లారీలకు ఇసుక ఎగుమతి చేస్తున్నారు. ఇక్కడ వే బ్రిడ్జి లేదు. జేసీబీ బకెట్‌తో ఇసుక లోడింగ్ చేస్తున్నారు. బకెట్ సుమారుగా 2 నుంచి 2.5 టన్నుల కెపాసిటీ గలదని, ట్రాక్టరుకు రెండు బకెట్లు వేసి, 4 మెట్రిక్ టన్నులుగా నిర్ణయించి రూ.980, అదే 3 యూనిట్ల లారీకి 5 బకెట్లు వేసి 10 మెట్రిక్ టన్నులుగా రూ.2,450, 6 యూనిట్ల లారీకి 10 బకెట్లు ఇసుక లోడ్ చేసి 20 మెట్రిక్ టన్నులుగా రూ.4,900 చెల్లించాలని నిర్ణయించినట్టు అధికారులు తెలిపారు. ఒక వినియోగదారునికి 20 మెట్రిక్ టన్నులు ఇసుక సరఫరా చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ కొప్పిశెట్టి ఏడుకొండలు, వీఆర్‌ఓ వీరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ కొరత సృష్టించే ప్రయత్నాలు..

కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఇప్పటి వరకూ ఇసుక నిల్వలను కొల్లగొట్టిన ఇసుకాసురులు వివిధ నిర్మాణాల పేరుతో ప్రస్తుతం ఉచిత ఇసుకను నిల్వలు పెడుతున్నట్టు సమాచారం. స్టాక్ పాయింట్లలో ఉన్న ఇసుక విక్రయాలు పూర్తయితే ముందు వర్షాకాలం, గోదావరి వరదలు వచ్చిన సమయంలో ఇసుక కొరత ఏర్పడుతుంది. ఆ సమయంలో నిల్వ చేసిన ఇసుకను అధిక రేట్లకు విక్రయించేలా ఇసుకాసురులు ప్రయత్నాల్లో ఉన్నారని తెలుస్తుంది.

శాకంబరిగా నూకాంబిక అమ్మవారు



ఆకుకూరలు, కాయగూరల అలంకరణలో..

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన గ్రామ దేవత నూకాంబిక అమ్మవారు బుధవారం శాకంబరి మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢమాసంలో అమ్మవారిని ఏటా శాకంబరిగా అలంకరించడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా శ్రీక్రోధ నామ సంవత్సర ఆషాఢ చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని గుప్త నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా మహిళ భక్త బృంద సభ్యులు 108 కిలోల వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో అమ్మవారిని అలంకరించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆలయ ముఖ మండపంలో భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. శాకంబరి అవతారంతో ఉన్న నూకాంబిక అమ్మవారిని భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

సమస్యలపై పూర్తి అవగాహనతో రండి



రైతుల ఖాతాల్లో నగదు పడలేదని ఎమ్మెల్యే సత్యనారాయణకు వివరిస్తున్న జెడ్పీటీసీ శ్రీనివాసరావు

అయినవిల్లి: అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రజలు పడుతున్న సమస్యలపై పూర్తి అవగాహన ఉన్నప్పుడే ఆ సమస్యలకు పరిష్కారం కనుక్కోవచ్చని తద్వారా వారికి పూర్తి న్యాయం చేయవచ్చని స్థానిక ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ మండల సర్వసభ్య సమావేశం మూడు నెలలలోకోసారి జరుగుతుందని ఈ సమావేశానికి అయా శాఖలకు చెందిన ముఖ్య అధికారులు విధిగా హాజరై ప్రజాప్రతినిధులు అడిగే ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలన్నారు. అలా కాకుండా దిగువ స్థాయి సిబ్బందిని పంపించడం వల్ల ప్రజాప్రతినిధుల అడిగే ప్రశ్నలకు తగిన సమాధానం రాక పోవడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేయడం జరుగుతుందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులకు ధాన్యం నగదు తమ బ్యాంకు ఖాతాల్లో త్వరగా జమ అయ్యేలా చేయాలని, రైతులు తొలకరి పంట సాగు చేసేందుకు సమాయత్తం అయ్యారన్నారు. ఎస్.మూలపాలెం, నేదునూరు, మాగం, వీరవల్లిపాలెం తదితర గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలని లో వోల్టేజీ సమస్య ఉందని పలువురు ప్రజాప్రతినిధులు విద్యుత్ శాఖ అధికారుల వద్దకు తీసుకొచ్చారు. విద్యుత్ శాఖ ఏఈ తీరుపై మండిపడ్డారు. ఏఈ ఏ సమావేశానికి హాజరుకారని ఆయన సమస్యలు పట్టించుకోరని సమావేశంలో ఎమ్మెల్యేకు వివరించారు. వైద్యశాఖ, పంచాయతీశాఖ, ఆర్‌అండ్‌బీ, ఎక్సైజ్, ఐసీడీఎస్, కార్మిక సంక్షేమశాఖ, గృహ నిర్మాణశాఖ ఇలా పలు శాఖలు ప్రజలకు అందిస్తున్న సేవలను అధికారులు వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ టి.సూర్యనారాయణమూర్తి, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షురాలు వార జయసావిత్రి, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

మా పిల్లలను ఆదుకోండి సారూ..



సాయం చేయాలంటూ వేడుకుంటున్న నాగేశ్వరరావు దంపతులు

అంబాజీపేట: ఆ దంపతులు రైతు కూలీలు. వారి ఇద్దరి పిల్లలకు అరుదైన వ్యాధి వల్ల కళ్లు కనిపించడం లేదు. ఆర్థిక స్తోమత లేక వైద్యానికి ఇబ్బంది పడుతున్నారు. వివరాల్లోకి వెళితే... గంగలకుర్రు అగ్రహారం శివారు అరిగెలవారిపాలెంలోని నాగేశ్వరరావు దంపతులకు ఇద్దరు పిల్లలున్నారు. వారు అరిగెల మణితేజ శ్రీపావని, అరిగెల వీరమణికంఠ సుధీర్‌కుమార్. ఈ ఇద్దరికి సుమారు 20 ఏళ్ల క్రితం నుంచి దశల వారీగా కళ్లు కనిపించకపోవడంతో వారు వైద్యం చేయించారు. చాలా మందులు, శక్తి వంతమైన ఇంజక్షన్లు వాడడం వల్ల చర్మ సంబంధిత వ్యాధులు కూడా ఎక్కువయ్యాయి. దీంతో వాళ్లకు వైద్యం చేయించడం నాగేశ్వరరావుకు కష్టమైంది. ఇద్దరి వేలిముద్రలు పడకపోవడం, ఐరీష్ పనిచేయక పోవడంతో ఏ ప్రభుత్వ పథకం అందడం లేదు. శ్రీపావనికి ఎడమ కాలుపై కణితి ఏర్పడడంతో వైద్యుల సూచనల మేరకు ఎడమ కాలులో మోకాలి కింద తొలగించారు. ఈ నేపథ్యంలో తమ పిల్లలు ఇరువురిని దాతలు ఆదుకోవాలంటూ ఆ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు.

వినియోగదారుల ఫోరం బెంచ్ ఏర్పాటు చేయాలి

మలికిపురం: గతంలో ఉమ్మడి జిల్లాలో అమలాపురంలో వినియోగదారుల ఫోరం బెంచ్ ఉండేదని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఏర్పడిన మీదట అమలాపురంలో వినియోగదారుల ఫోరం ఏర్పాటు చేసి వినియోగదారులకు వెసులుబాటు కల్పించాలని మలికిపురం, సఖినేటిపల్లి మండలాల వినియోగదాలు సంక్షేమ సంఘం అధ్యక్షుడు మాలే శ్రీనివాస నగేష్ పేర్కొన్నారు. మలికిపురం సఖినేటిపల్లి మండలాల వినియోగదారుల సంక్షేమ సంఘ సమావేశం అధ్యక్షుడు మాలే శ్రీనివాస నగేష్ అధ్యక్షతన ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం జరిగింది. శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ ప్రతి దుకాణం వద్ద ఎలక్ట్రానిక్ కాటాలే ఉండాలని ప్రభుత్వం నిబంధనలు ఉన్నాయని అన్నారు. సంఘానికి నూతనంగా లీగల్ అడ్వైజర్‌గా ఏలూరి లక్ష్మీసుధను ఏకగ్రీవంగా ఆమోదించి సమావేశం నియమించింది. ఆమెను సంఘ సభ్యులు అభినందించారు. అనంతరం పలు తీర్మానాలు చేసి ఆమోదించారు. మలికిపురంలో రిలయన్స్ స్మార్ట్, విక్టరీ బజార్ వ్యాపార సంస్థలు వేలాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన బ్యాగులు కూడా డబ్బులు చెల్లించవలసి వస్తుందని సమావేశం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. వినియోగదారులకు ఉచితంగా గుడ్డ బ్యాగులు అందించాలని సమావేశం డిమాండ్ చేసింది. మలికిపురంలో రైతు బజార్‌ని ప్రభుత్వం ఏర్పాటు చేయాలని సమావేశం కోరింది. సమావేశంలో ఎంపీడీవో కార్యాలయ సూపరింటిండెంట్ గొల్లమందల మిల్టన్, ప్రధాన కార్యదర్శి కోళ్ల వేణు ప్రసాద్, ముఖ్య సలహాదారు గెద్దం పేర్రాజు,, ఉపాధ్యక్షులు పిండి సత్యనారాయణ, పలచోళ్ళ రాంబాబు, ట్రెజరర్ ఇందుకూరి అచ్యుత రామరాజు, మేడిచర్ల రాము, పెచ్చెట్టి శివశంకర్, రావూరి పెద్దబ్బులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు పూర్తి చేసేందుకు చర్యలు



అంతర్వేది దేవస్థానం కార్యాలయంలో ఎమ్మెల్యే వరప్రసాద్‌తో సమావేశమైన అధికారులు

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానం పరిధిలో ఆలయ అభివృద్ధికి చేపట్టేబోయే పనులను త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఎండోమెంట్స్ ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. బుధవారం అంతర్వేది దేవస్థానం కార్యాలయంలో ఈ మేరకు ఎండోమెంట్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి.దుర్గేష్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ జి.శ్రీనివాస్, డిప్యూటీ స్థపతి జి.శ్రీనివాసాచార్యులు, ఎమ్మెల్యేను కలసి సదరు అభివృద్ధి పనుల గురించి వివరించిన దశలో ఎమ్మెల్యే పై విధంగా వారికి సూచనలు చేశారు. తొలుత ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణతో కలసి ఇంజినీరింగ్, స్థపతి అధికారులు ఆయా చోట్ల సైట్లను పరిశీలించారు. అభివృద్ధి పనుల్లో భాగంగా నూతన అన్నదాన బిల్డింగ్ నిర్మాణం, సముద్ర తీరంలో భక్తులు దుస్తులు మార్చుకునే గదుల నిర్మాణం, మరుగుదొడ్ల నిర్మాణాల గురించి, నీలకంఠేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణం పనులపై చర్యలు నిమిత్తం ఈ పరిశీలన చేశారు. ఎంపీటీసీ భైరా నాగరాజు, ఆలయ సీనియర్ అసిస్టెంట్ ఎం.సత్యకిరణ్ పాల్గొన్నారు.

తాగునీటి కోసం ఆందోళన



రామరాజులంకలో తాగునీటి కోసం ఆందోళన చేస్తున్న గ్రామస్తులతో మాట్లాడుతున్న కార్యదర్శి శ్రీహరి

మలికిపురం: మండలంలోని రామరాజులంకలో బుధవారం గ్రామస్తులు తాగునీటి కోసం ఆందోళన చేశారు. సర్పంచ్ కాకర శ్రీనివాస్ అధ్యక్షతన గ్రామ సభ జరిగింది. గ్రామంలో గత నెల రోజులుగా తాగునీరు అందక అవస్థలు పడుతున్నామని పేర్కొన్నారు. గ్రామంలోని పెదతిప్ప, బాడవ, చర్చిపేట, కాలువ గట్టు, ప్రాంతాల్లో తాగునీరు లేక తీవ్ర అవస్థలు పడుతున్నట్లు పేర్కొన్నారు. వెంటనే స్పందించి అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సర్పంచ్ శ్రీనివాస్ వారికి నచ్చచెప్పే ప్రయత్నం చేసినా గ్రామస్తులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శి బొంతు శ్రీహరి వారితో మాట్లాడుతూ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని పేర్కొన్నారు. ఎంపీపీ మేడిచర్ల వెంకట సత్యవాణి మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సరఫరా మెరుగుపరిచేందుకు అన్ని చర్యలూ తీసుకుంటానని హామీ ఇచ్చారు.

నేలకొరిగిన భారీ వృక్షం

అంబాజీపేట: ఒక్కసారిగా ఈదురుగాలులు వీయడంతో మాచవరం సెంటర్‌లో ఉన్న భారీ వృక్షం బుధవారం తెల్లవారుజామున నేలకొరిగింది. ఈ వృక్షం విద్యుత్ వైర్లపై పడటంతో విద్యుత్ స్తంభాలు, వైర్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. రహదారిపై చెట్టు పడిపోవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో పగటి పూట అయితే పెను ప్రమాదం సంభవించేదని తెల్లవారుజామున జరగడంతో ఎవరికి ఏమీ జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

మానవసేవకు బౌద్ధంలో అధిక ప్రాధాన్యం

అయినవిల్లి: ప్రపంచ శాంతి, సర్వ మానవ సంక్షేమాన్ని కాంక్షించే బౌద్ధంలోని అష్టాంగ మార్గాల్లో సేవ, సహాయాలు ఒక భాగమని మానససేవకు బౌద్ధం అధిక ప్రాధాన్యం ఇస్తుందని శ్రీలంక బౌద్ధ సన్యాసి, తెలుగు శ్రీలంక జనతా ఫౌండేషన్ వైస్ చైర్మన్ రెవ.బోధిహీన అన్నారు. బుధవారం తన పర్యటనలో భాగంగా బోధిహీన్ అయినవిల్లి మండలం కె.జగన్నాథపురం విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అని బోధించిన బౌద్ధ సిద్ధాంతాన్ని ఆచరించారన్నారు. తమ గృహాన్ని ఒక దేవాలయంతో సమానంగా మార్చారన్నారు. శాంతి, అహింస, సత్యాన్వేషణ దిశగా ప్రపంచాన్ని పయనింప చేయటంలో బౌద్ధం విశేషకృషి చేస్తోందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా కరోనా సమయంలో విశేష సేవలు అందించిన జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు గంగుమళ్ళ కాశీ అన్నపూర్ణ, శ్రీనివాస్ దంపతులను అభినందించారు. అనంతరం గంగుమళ్ళ దంపతులకు ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో గనిశెట్టి గోవిందరాజులు, వల్లభరెడ్డి సూరిబాబు, నల్లా సత్తిబాబు, నల్లా సందీప్ కొప్పిశెట్టి వీరబాబు అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

రేషన్‌షాపులో అవకతవకలపై కేసు

కొత్తపేట: మండలంలోని వానపల్లి రేషన్ షాపులో బియ్యం స్టాకుకు సంబంధించి జరిగిన అవకతవకలపై 6 ఏ కేసు నమోదు చేసినట్టు మండల పౌర సరఫరాల అధికారి (ఎంఎస్‌ఓ) డి.శ్రీనివాసరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. వానపల్లిలో 30వ రేషన్ షాపులో అవకతవకలు జరిగినట్టు స్థానికులు ఆర్డీవో జీవీవీ సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు స్థానిక ఎంఎస్‌ఓ శ్రీనివాసరావుతో పాటు రావులపాలెం ఎంఎస్‌ఓ ఎంఎస్‌జే చింతామణి సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. 9 క్వింటాళ్ల 5 కేజీల బియ్యం ఆన్‌లైన్‌లో చూపిస్తుండగా ఫిజికల్‌గా ఆ స్టాకు షాపులో లేదని గుర్తించారు. దానిపై సంబంధిత డీలర్ మర్రి శ్రీకళపై 6ఏ కేసు నమోదు చేసి, జేసీ కోర్టుకు నివేదిస్తున్నట్టు ఎంఎస్‌ఓ శ్రీనివాసరావు తెలిపారు. ఆ డీలర్ ప్రస్తుతం స్థానికంగా అందుబాటులో లేరని, ఆమె బంధువైన మరో మహిళ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ షాపును 29వ షాపు డీలర్‌కు ఇన్‌చార్జ్ వేసినట్టు తెలిపారు.

మొహర్రంలో భాగంగా పీర్ల ఊరేగింపు



మామిడికుదురులో పీరు ఊరేగింపు

మామిడికుదురు: మొహర్రం సంతాప దినాల్లో భాగంగా బుధవారం మామిడికుదురు, నగరం గ్రామాల్లో పీర్లను ఊరేగించారు. మామిడికుదురు ఇమామ్ హుస్సేన్ పంజాతో పాటు నగరం షహజాదే ఖాసిం పంజాలో మొహర్రంలో భాగంగా మజ్లిస్ జరిగింది. మజ్లిస్ అనంతరం నాల్ ముబారక్ పీర్లను ఊరేగించారు. బడే బీబీ పంజా, సర్కిల్ బాషి స్వగృహంతో పాటు మజిలే కర్బలా పంజాల్లో జరిగిన మజ్లిస్‌ల్లో మత ప్రబోధకుడు మహ్మద్ అలీ జాఫరీ పాల్గొని మజ్లిస్ ఆలపించారు. మొహర్రం ప్రాధాన్యతను భక్తులకు వివరించారు. సుదూర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో వచ్చిన ముస్లింలు హజరత్ ఇమామ్ హుస్సేన్‌తో పాటు అతని పరివారానికి శ్రద్ధాంజలి ఘటించారు.

శ్రీనివాస్‌కు ఆర్థిక సాయం



క్షతగాత్రుని కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు

పి.గన్నవరం: ఇటీవల శివకోడులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాషా శ్రీనివాస్‌కు మానేపల్లి ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు బుధవారం రూ.25 వేలు సాయం అందించారు. ఈ సొమ్మును శ్రీనివాస్ భార్యకు వారు అందజేశారు. కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు ఆరుమిల్లి హరినారాయణ, ఎండీ మొహిద్దీన్, ఎం.అంజిబాబు, కడలి శ్రీనివాస్, గుబ్బల సత్యనారాయణ, సరిళ్ల కృష్ణ, దేవళ్ల శ్రీనివాస్, కుడుపూడి త్రినాథ్, జి.గుప్తా, ఇసుకపూడి రాఘవులు, ఎండీ రహీమ్ షాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

జీతాలు ఇప్పించండి

అంబాజీపేట: గత రెండు నెలలుగా జీతాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సత్వరమే జీతాలు ఇప్పించాలని సమగ్ర శిక్ష తాత్కాలిక ఉద్యోగులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అంబాజీపేట మండల రీసోర్స్ భవనం వద్ద తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ బుధవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు.

కంటి వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

అంబాజీపేట: కళ్లకు సంబంధించిన వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సిలోయం కంటి వైద్య నిపుణులు వి.ప్రభాకర్ అన్నారు. కె.పెదపూడిలో జోసఫ్ మినిస్ట్రీస్ నుండి 30 మందికి కంటి శస్త్ర చికిత్సకు రాజమహేంద్రవరం పరమహంస ఆస్పత్రికి బుధవారం పంపించారు. ప్రభాకర్ మాట్లాడుతూ వ్యవస్థాపకుడు, రిటైర్డ్ మాజీ ఇండియన్ నేవీ అధికారి యు.జీవరత్నం ఆధ్వర్యంలో ఈ నెల 4న మెగా మెడికల్ క్యాంపు నిర్వహించామని, ఈ క్యాంపులో కంటి రోగులకు పరీక్షలు చేశామన్నారు. వారిలో 30 మందికి శస్త్ర చికిత్స అవసరమై ఉన్నందని గుర్తించి వారికి ఉచితంగా ఆపరేషన్ చేసేందుకు తరలించామన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

మలికిపురం: గ్రామ పంచాయతీల్లో పని చేసే కాంట్రాక్ట్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని పంచాయతీ కాంట్రాక్టు కార్మికులు రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌ను కోరారు. బుధవారం మలికిపురంలో ఎమ్మెల్యేను కలసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. ఉన్నత చదువులు చదువుకుని కూడా ప్రభుత్వంపై నమ్మకంతో ఇన్నాళ్లు చాలీ చాలనీ జీతాలతోనే కాలం నెట్టుకొస్తున్నామని పేర్కొన్నారు. దీని సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కె.నాగేశ్వరరావు, కె.శ్రీనివాసరావు, తదితరులు వినతిపత్రం అందించిన వారిలో ఉన్నారు.